సాక్షి
సోమవారం । 28 । అక్టోబర్ । 2024

అభివృద్ధిలో కాలనీ అసోసియేషన్ల పాత్ర కీలకం



ప్రశాంత్‌నగర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న మేయర్ లతాప్రేమ్‌గౌడ్

బండ్లగూడ: కాలనీల అభివృద్ధి కోసం వెల్ఫేర్ అసోసియేషన్‌లు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని.. వాటి పాత్ర కీలకంగా ఉంటుందని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్ అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్ కాలనీలో నూతన వెల్ఫేర్ అసోసియేషన్‌ను ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చక్రవర్తి, ఉపాధ్యక్షులుగా అనిల్, మధు, ప్రధాన కార్యదర్శిగా విజయ్ ఠాకూర్, సలహాదారులుగా అఫ్సర్ అలీ, పెంటారెడ్డి, కుసుమ, జ్యోతి తదితరులను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులను మేయర్ లతా ప్రేమ్‌గౌడ్ ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... కార్పొరేషన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ప్రశాంత్‌నగర్ కాలనీవాసులు తమ సమస్యలను కలిసికట్టుగా ఉంటూ పరిష్కరించుకోవాలని సూచించారు. కాలనీ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని స్పష్టం చేశారు.

ఘనంగా దుర్గామాత ఆలయ జీర్ణోద్ధరణ పూజలు



పూజల్లో పాల్గొన్న నిర్వాహకులు, భక్తులు

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడలోని అతి పురాతన దుర్గామాత ఆలయ జీర్ణోద్ధరణ పూజలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 7 గంటలకు గణపతి, నవగ్రహ పూజలు, అభిషేకం, హోమం చేసి గర్భాలయంలో ఉన్న పురాతన విగ్రహాన్ని గోమాత ద్వారా తీశారు. ఈ పూజలు మహేష్ పంతులు, భవాని పంతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. పూజా కార్యక్రమాలు శెట్టిగారి వసంతరావు సుజాత దంపతులు, శెట్టిగారి రమేష్, శెట్టిగారి నరేందర్(చిన్న)ల కుటుంబ సభ్యులు చేయించారు. కార్యక్రమంలో కొలన్ సుభాష్‌రెడ్డి, నారగూడెం మల్లారెడ్డి, మ్యాడం రామేశ్వరరావు, మోండ్ర నర్సింహ, బర్ల మల్లారెడ్డి, మోండ్ర కొమురయ్య, వనం నర్సింహ్మా, సాబాదా వియజ్‌కుమార్, మ్యాడం జెవంత్, కుమ్మరి కళావతి, సి.హెచ్.రవి, శ్రీను, కె.హరి, శ్రీశైలం, కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

పక్కదారి పడుతున్న భగీరథ నీరు!

- వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న వైనం
- కవేలిగూడలో తాగునీటికి ప్రజల ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులపై సర్వత్రా ఆగ్రహం

శంషాబాద్ రూరల్: గ్రామంలో ఓ వైపు తాగునీటి కష్టాలు ఎదురవుతుంటే.. మరో వైపు మిషన్ భగీరథ నీటిని వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారు. పంచాయతీ సిబ్బంది ఇష్టానుసారంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాలివీ... రామంజాపూర్ పంచాయతీ అనుబంధ గ్రామం కవేలిగూడలో తాగునీటిని వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాల వద్ద ఉన్న మినీ ట్యాంకు, ఓవర్ హెడ్ ట్యాంకు నుంచి నల్లా ద్వారా నీళ్లను దారి మళ్లిస్తున్నారు. సమీపంలో ప్రీకాస్టు, సిమెంటు రింగుల వ్యాపారస్తులు ఈ నీళ్లను వాడుకుంటున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పంచాయతీ సిబ్బంది చేతివాటంతో తాగునీటిని ఇలా దారి మళ్లిస్తున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించి పంచాయతీ నీటిని ఇతర అవసరాల కోసం వినియోగించడాన్ని నిలిపివేయాలని కోరుతున్నారు. కొన్ని రోజులుగా గ్రామంలో తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు.



కవేలిగూడలో తాగునీటిని వాణిజ్య అవసరాల కోసం పైప్‌లైన్ ఏర్పాటు చేసిన దృశ్యం

గండిపేటలో పగిలిన నీటి పైపు

మణికొండ: గండిపేటలో కొనసాగుతున్న రోడ్డు పనుల్లో మంచినీటి పైప్ లైన్‌కు ఆదివారం జేసీబీ తగిలి పైప్ లైన్ పగిలిపోయింది. దాంతో పెద్ద ఎత్తున తాగునీరు వృథాగా పోయింది. విషయం తెలుసుకున్న జలమండలి జీఎం మహేందర్‌నాయక్ సంఘటనా స్థలానికి చేరుకొని నీటి వృథాను పరిశీలించి సరఫరాను నిలిపివేయించారు. మరమ్మతు పనులు కొనసాగుతున్నాయని, 800 గృహాలకు, 20 గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్‌లకు ఉన్న బల్క్ కనెక్షన్‌ల నీటి సరఫరాకు అంతారాయం కలిగిందని ఆయన పేర్కొన్నారు. మరమ్మతు పనులు పూర్తి కాగానే నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని ఆయన తెలిపారు. జలమండలి అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



గండిపేటలో పగిలిన పైపును పరిశీలిస్తున్న జలమండలి అధికారులు

నేడు సెట్విన్ కార్యక్రమాలపై మంత్రి పొన్నం సమీక్ష

యాకుత్‌పురా: ప్రభుత్వరంగా సెట్విన్ శిక్షణ సంస్థ కార్యక్రమాలపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం సంస్థ చైర్మన్ గిరిధర్‌రెడ్డితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించనున్నారని సెట్విన్ ఎండీ కె.వేణుగోపాల్‌రావు తెలిపారు. పురానీహవేలిలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో ఉదయం 11.30 గంటలకు సమీక్ష ఉంటుందన్నారు. యువతకు ఉపాధి, ఉద్యోగాల కల్పన కోర్సులు తదితర అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ శంషాబాద్ అధ్యక్షుడిగా బాలరాజు



కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం



శంషాబాద్: టీఎస్‌యూటీఎఫ్ శంషాబాద్ మండల శాఖ అధ్యక్షుడిగా డి.బాలరాజు, ప్రధాన కార్యదర్శిగా సబావత్‌నాను నియమితులయ్యారు. ఆదివారం మండల కేంద్రంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కె.శ్రీనివాస్, మహిళా ఉపాధ్యక్షురాలిగా ఎం.లక్ష్మి, కోశాధికారిగా డి.వెంకటేష్, కార్యదర్శులుగా పి.శ్రీనివాస్, మంజుల, సరళజ్యోతి, పరమేశ్వర్ రెడ్డి, స్వర్ణలత, మహిళా విభాగం కన్వీనర్‌గా వి.శారదాదేవి, సభ్యురాలిగా ఎ.విజయలక్ష్మి, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్లుగా టి.శ్రీనివాస్, సి.మాధవి, జిల్లా ప్రతినిధులుగా పి.రాములు, సి.హెచ్.మధుసూదనాచారి నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను సభ్యులు ఘనంగా సన్మానించారు.

పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తం

- ప్రైవేటు పొలంలో చెత్త డంపింగ్
- నిరుపయోగంగా డంపింగ్ యార్డు

శంషాబాద్ రూరల్: గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. చెత్త సేకరణలో పంచాయతీ అధికారులు నిబంధనలు పాటించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండలంలోని చౌదరిగూడలో ఇంటింటి నుంచి సేకరించే తడి, పొడి చెత్తను వేర్వేరుగా కాకుండా ఒకే చోట డంప్ చేస్తున్నారని పేర్కొంటున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన చెత్త డంపింగ్ యార్డును నిరుపయోగంగా మార్చిన అధికారులు.. చెత్తను ప్రైవేటు భూమిలో డంప్ చేస్తున్నారని తెలిపారు. గ్రామంలో రోడ్డు, వీధుల వెంబడి చెత్త, చెదారంతో పాటు పిచ్చి మొక్కలు పెరిగి దోమలు వ్యాప్తి చెందుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక పంచాయతీ కార్యదర్శి ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ప్రజా సమస్యలు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీ ధారావి ఇన్‌చార్జిగా సిద్ధేశ్వర్



రాచమల్ల సిద్ధేశ్వర్

శంషాబాద్: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ముంబయి నగరంలోని ఎస్సీ రిజర్వు స్థానమైన ధారావి అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, రాజీవ్‌గాంధీ పంచాయతీ సంఘటన్ రాష్ట్ర చైర్మన్ రాచమల్ల సిద్ధేశ్వర్‌ను నియమించారు. ఈ మేరకు ఏసీసీ కార్యదర్శి శశికుమార్ సెంథిల్ నియమితుల జాబితాను ఆదివారం విడుదల చేశారు. ధారావిలో కాంగ్రెస్ ఘన విజయం కోసం పూర్తి స్థాయిలో వ్యూహాత్మకంగా పనిచేయనున్నట్లు ఈ సందర్భంగా సిద్ధేశ్వర్ పేర్కొన్నారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ



దుస్తులను పంపిణీ చేసిన వెంకటేశ్‌యాదవ్

మణికొండ: పండగలు మనకు సుఖ, సంతోషాలను పంచేందుకు వస్తాయని వాటిని మనం కలసికట్టుగా ఘనంగా జరుపుకోవాలని నార్సింగి మున్సిపల్ కౌన్సిలర్‌లు జి.వెంకటేష్‌యాదవ్, జి.అరుణజ్యోతి అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు వారు ఆదివారం కొత్త దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దీపావళి పండగ అందరికీ సంతోషాలను పంచాలన్నారు. ప్రతి రోజూ ప్రజలు శ్రేయస్సుకు కృషి చేసే కార్మికులకు తమ వంతు సాయంగా నూతన దుస్తులను పంపిణీ చేశామన్నారు.

రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో రాణించిన అన్విక



మణికొండ: రాష్ట్ర స్థాయి కరాటే చాంపియన్ షిప్ పోటీలలో నార్సింగి మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన జల్లి అన్విక రాణించి ద్వితీయ స్థానంలో నిలిచింది. ఆదివారం నెక్నాంపూర్ రోడ్డులోని భాష్యం బ్లూమ్స్ స్కూల్ 8వ జేకేఎస్ఎస్‌కేఐ రాష్ట్ర స్థాయి చాంపియన్ షిప్ పోటీలు జరిగాయి. అందులో 6 సంవత్సరాల వయసు విభాగంలో రాణించి ద్వితీయ స్థానంలో నిలిచింది. దీంతో నవంబర్‌లో పూణేలో జరిగే అంతరాష్ట్ర పోటీలకు అర్హత సాధించిందని కోచ్ తెలిపారు. చిన్న వయసులోనే కరాటేలో అంతరాష్ట్ర పోటీలకు హాజరవుతున్న అన్వికను ఉపాధ్యాయులతో పాటు బంధుమిత్రులు అభినందించారు.

చిత్రకళకు వేదికగా 'కలర్ చాంప్'



పెయింటింగ్ వేస్తున్న చిన్నారులు

శంషాబాద్: చిత్రకళకు కలర్‌చాంప్–24 వేదిక రంగురంగుల చిత్రాలతో మెరిసిపోయింది. శంషాబాద్ పట్టణంలోని ఎస్ఆర్ క్లాసిక్ కన్వెన్షన్ వేదికగా నిర్వహించిన 17వ కలర్‌చాంప్ పోటీలోని దేశంలోని పలు నగరాలకు చెందిన పదిహేను సంవత్సరాలలోపు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలను ప్రముఖ పారిశ్రామిక డిజైనర్ అమిత్ కృష్ణ గులాటి ప్రారంభించి మాట్లాడారు. సృజనాత్మక నైపుణ్యాలున్న వారికి విశ్వవ్యాప్తంగా అవకాశాలు పోటీపడుతూ వస్తాయన్నారు. కార్యక్రమంలో సుమారు ఐదొందలకు పైగా విద్యార్థులు పాల్గొని తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో సిప్ అకాడమీ వ్యవస్థాపకులు దినేష్, గ్లోబల్ వార్ట్ వ్యవస్థాపకుడు అజిన్ థాంగ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో భజన కార్యక్రమాలు

రాజేంద్రనగర్: బుద్వేల్ టీచర్స్ కాలనీలోని శ్రీశ్రీశ్రీ కట్ట మైసమ్మ ఆలయంలో ఆదివారం ఉదయం 10.30 గంటలకు సేవా భారతి ఆధ్వర్యంలో భజన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సమాజసేవలో ముందుంటాం...

రాయదుర్గం: సమాజ సేవలో శ్రీకృష్ణా యూత్ ఎప్పుడూ ముందుంటుందని శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని గౌలిదొడ్డిలో అపోలో ఆస్పత్రి సహకారం శ్రీకృష్ణా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి, వైద్య శిబిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. సమాజంలో ఎంతో మంది వ్యాధులను గుర్తించలేక వైద్యానికి దూరమవుతూ అనేక రోగాల బారినపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి పేద, మధ్య తరగతి ప్రజలకు ఆస్పత్రికి వెళ్లలేని వారికోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. శ్రీకృష్ణ యూత్ అసోసియేషన్ ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించడం హర్షణీయమని అన్నారు. భవిష్యత్తులోనూ మరిన్ని ప్రాంతాల్లో సేవాకార్యక్రమాలు నిర్వహించాలని ఆయన సూచించారు. అంతకుముందు అపోలో వైద్య బృందం స్థానికులకు వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. శ్రీకృష్ణయూత్ రాష్ట్ర అధ్యక్షుడు అభిషేక్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు సురేందర్, అనీల్, రోహిత్‌గౌడ్, విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు

మైలార్‌దేవ్‌పల్లి: కాటేదాన్ మార్కెట్‌లో గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. చిన్నచిన్న ప్యాకెట్‌లను చేసి మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అతడి నుంచి వేయింగ్ మిషన్‌తో పాటు 150 గ్రాముల గంజాయిని సీజ్ చేశారు. విక్రయదారుడిని అరెస్టు చేసి ఎన్‌డీ పీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ప్రజావాణి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఉప కమిషనర్ రవికుమార్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణి నిర్వహిస్తామన్నారు. రాజేంద్రనగర్, అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రీపురం, సులేమాన్‌నగర్ డివిజన్ల పరిధిలోని ప్రజలు తమ సమస్యలపై ప్రజావాణిలో ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవాలన్నారు. జీహెచ్ఎంసీలోని అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

1న యాదవ సదర్ సందడి

రాజేంద్రనగర్: అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో నవంబర్ 1వ తేదీన (శుక్రవారం) రాత్రి 9 గంటలకు యాదవ సదర్ సందడి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అఖిల భారత యాదవ మహాసభ రాజేంద్రనగర్ ఉపాధ్యక్షుడు ఎం.నరేశ్ యాదవ్ తెలిపారు. రాజేంద్రనగర్ బుద్వేల్ గ్రామం శివాలయం వద్ద కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తామన్నారు. ఈ సదర్ జాతర, దున్నపోతుల ఊరేగింపు కార్యక్రమానికి యాదవ బంధువులందరూ, డివిజన్ ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్స్

బండ్లగూడ: ప్రధాన రహదారుల వెంట ప్రమాదభరితంగా మ్యాన్‌హోల్స్ ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై ఉన్న మ్యాన్‌హోల్స్ కొన్ని రోజులుగా ప్రమాదకరంగా తయారయ్యాయి. నిత్యం వేలాదిగా వాహనాలు, ప్రజలు ఈ దారి గూండా రాకపోకలు సాగిస్తుంటారు. కాళీమందిర్ బస్ స్టాప్ ప్రాంతంలో ఉన్న ఈ మ్యాన్‌హోల్ ఉన్న కారణంగా వాహనాదారులు అందులో పడి ప్రమాదాలకు గురవుతున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్స్‌కు సత్వరమే మరమ్మతులు నిర్వహించి సమస్యలు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



కాళీమందిర్ ప్రాంతంలో ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్

హిందీ ఉపాధ్యాయురాలికి డాక్టరేట్



రూపాదేవిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాజేంద్రనగర్: శివరాంపల్లికి చెందిన రూపాదేవి హిందీ విభాగంలో డాక్టరేట్ అందుకున్నారు. ప్రస్తుతం రూపాదేవి శివరాంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రాజేంద్రనగర్ యాదవ్ కె కథా సాహిత్య మే చేతనా కే ఆయాం అనే అంశంపై డాక్టర్ రాజశ్రీ మోరే పర్యవేక్షణలో పరిశోధనలు పూర్తి చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల హిందీ విభాగం నుంచి డాక్టరేట్ పొందానని శారద తెలిపారు. ఈ సందర్భంగా సహచర ఉపాధ్యాయులు, బంధువు మిత్రులు ఆమెకు అభినందనలు తెలిపారు. పరిశోధనకు పూర్తి సహకారం అందించిన ఉపాధ్యాయులు, బంధువు, మిత్రుల గైడ్లకు రూప ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

చౌరస్తాల సుందరీకరణకు నిధుల మంజూరు

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలోని ప్రధాన కూడళ్లు, ఫ్లై ఓవర్ల యూటర్న్‌ల అభివృద్ధి, సుందరీకరణకు రెండు కోట్ల రూపాయలు మంజూరయ్యాయని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన కార్వాన్ నియోజకవర్గం పరిధిలోని నానల్‌నగర్ చౌరస్తా, టోలిచౌకీ చౌరస్తా, సెవన్ టూంబ్స్ చౌరస్తా, గోల్కొండ కోట చౌరస్తా తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ట్రాఫిక్, బల్దియా అధికారులతో ఆ కూడళ్లను ఆకర్షణీయంగా తయారు చేసేందుకు అవసరమైన చర్యల గురించి చర్చించారు. గోల్కొండ కోటకు ప్రతినిత్యం దేశవిదేశాల నుంచి ప్రతినిత్యం పర్యాటకులు వస్తుంటారని గోల్కొండ చౌరస్తాను ఆకట్టుకునే విధంగా డిజైన్ చేయాలని అయన సూచించారు. టోలిచౌకీ వద్ద ఉన్న సాలర్ ఫ్లైఓవర్ పరిసరాలు అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతమన్నారు. హైటెక్ సిటీ, గచ్చిబౌలి తదితర ప్రాంతాలకు ఈ చౌరస్తా గుండానే రాకపోకలు జరుగుతాయన్నారు. ఫ్లైఓవర్ పిల్లర్లపై అందమైన రంగు రంగుల బొమ్మలు వేయాలని, యూటర్న్ వద్ద సైత ఆకట్టుకునే విధంగా కళాకృతులను ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. పలు కూడళ్ల వద్ద ప్రతినిత్యం ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయని సెవన్ టూంబ్స్ చౌరస్తా ఇందులో ఒకటని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట బల్దియా అధికారులతో పాటు ట్రాఫిక్ ఏసీపీ బి.ధనలక్ష్మి, గోల్కొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.సుధాకర్‌రావు తదితరులున్నారు.



ట్రాఫిక్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మజ్లిస్ సెక్యులర్ పార్టీ..

మజ్లిస్ సెక్యులర్ పార్టీ అని ఈ కారణంగానే మజ్లిస్‌కు ప్రజాదరణ రోజు రోజుకూ పెరుగుతుందని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం మల్కాపూర్ గ్రామానికి చెందిన పలువురు ఆదివారం ఎమ్మెల్యేను టోలిచౌకీలోని ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వారు తమ గ్రామంలోని జయదుర్గామాత ఆలయ అభివృద్ధికి పలువురు అడ్డుకుంటున్నారని ఈ విషయంలో తమకు సహకరించాలని వారు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఈ విషయంలో తన సహాయ సహకారాలు తప్పకుండా ఉంటాయని అన్నారు. కె.శ్రీనివాస్, బి.రమేష్, గన్‌ఫూర్ మార్కెట్ డైరెక్టర్ యశ్వంత్‌రెడ్డి, శివరాత్రి రవి, అశోక్, కె.అరుణ్ తదితరులున్నారు.


ఆయన చూపే పేదవాడికి వెన్నల వెలుగు...
ఆయన నవ్వే బీదవాడికి కొండంత అండ ఆయన మనసే అభాగ్యులకి భరోసా...
రాష్ట్ర సమాచార, రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి
జన హృదయ నేత
శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారికి
జన్మదిన శుభాకాంక్షలు
మువ్వా విజయ్ బాబు
ఆర్. రఘురాం రెడ్డి
ఖమ్మం పార్లమెంటు సభ్యుడు
శ్రీ రఘునాథ్ యాదవ్
కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు
శేరిలింగంపల్లి నియోజకవర్గం